ప్రజాశక్తి
శనివారం 8 జూలై 2023
5
శ్రీకాకుళం



బాలల హక్కులకు భరోసా ఇచ్చేనా?

- నేటి నుంచి మిషన్ వాత్సల్య పరిధిలోకి చైల్డ్‌లైన్ సేవలు
- ఎన్‌జిఒల నుంచి మహిళా శిశు సంక్షేమశాఖకు బదిలీ
- జిల్లా కేంద్రంలో హెల్ప్‌లైన్ యూనిట్
- పలాస రైల్వేస్టేషన్‌లో మరో కేంద్రం ఏర్పాటు

నిస్సహాయ స్థితిలో ఉన్న బాలలకు సాయం అందించడంతో పాటు వారి హక్కులను రక్షించడమే లక్ష్యంగా ఏర్పాటైన చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలు నేటి నుంచి మిషన్ వాత్సల్య పథకం ద్వారా అందనున్నాయి. ఇప్పటివరకు చైల్డ్‌లైన్ ఫౌండేషన్ (సిఐఎఫ్) అందిస్తున్న నిధులతో జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థలు ఈ సేవలను అందిస్తూ వచ్చాయి. చైల్డ్‌లైన్ సేవలను మిషన్ వాత్సలయ్యకు అప్పగించాలంటూ ఈ ఏడాది ఏప్రిల్ 13న సిఐఎఫ్‌కు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థలు తప్పుకున్నాయి. ఇకపై జిల్లాలో దీని అమలు బాధ్యతను మహిళా, శిశుఅభివృద్ధి సంస్థ పర్యవేక్షించనుంది. అందుకనుగుణంగా సంస్థ ఏర్పాట్లను చేస్తోంది. ఇప్పటికే తాత్కాలిక సిబ్బందిని నియమించింది. జిల్లా కేంద్రంతో పాటు రైల్వేస్టేషన్‌లో చిన్నారుల కోసం పలాస రైల్వేస్టేషన్‌లో మరో యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన పరికరాలు, నెట్‌వర్క్‌ను సమకూర్చుకునే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బాలలతో పనిచేయించడం, లైంగిక వేధింపులు, హింసతో పాటు బాల్య వివాహాలను అరికట్టాలనే ఉద్దేశంతో కేంద్ర మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో 1995లో 1098 నంబరుతో ఒక మోనటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసింది. ముంబయి కేంద్రంగా పనిచేసే 1098 నెట్‌వర్క్ సెంటర్‌కు వచ్చిన ఫోన్ కాల్స్‌ను జిల్లాలో ఎంపిక చేసిన స్వచ్ఛంద సంస్థలకు సమాచారం ఇచ్చేవారు. జిల్లాలో బ్రెడ్స్ సంస్థ నోడల్ ఏజెన్సీగా, యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జిపురం సహకారం అందించే సంస్థగా వ్యవహరించేవి. ఇవి కొన్ని ప్రాంతాల్లో సబ్ సెంటర్లనూ నిర్వహించేవి. ఆర్ట్స్ సంస్థ పాలకొండలో, గెస్ట్ సంస్థ పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో సబ్ సెంటర్లను ఏర్పాటు చేసి సేవలందించేవి. దీంతోపాటు పలాసలో రైల్వేస్టేషన్ కేంద్రంగా అప్‌హోల్డ్ అనే సంస్థ ఈ సేవలను అందించేది. వీటికి కేంద్ర ప్రభుత్వం చైల్డ్‌లైన్ ఫౌండేషన్ సంస్థ ద్వారా నిధులు సమకూర్చేది. దేశవ్యాప్తంగా పలు జిల్లాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు ఇలా వెయ్యికి పైగా యూనిట్లతో నెట్‌వర్క్ నిర్వహించడంతో ఇబ్బందుల్లో ఉన్న చిన్నారుల నుంచి వచ్చిన ఫోన్లకు స్పందించడానికి దాదాపు గంట సమయం పడుతున్నట్లు కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ గుర్తించింది. దీంతోపాటు ప్రస్తుత వ్యవస్థ పోలీస్, అగ్ని ప్రమాదాలు, అంబులెన్స్ తదితర సేవలను అప్పటికప్పుడే అందించే పరిస్థితి లేనట్లుగా గుర్తించింది. అందులో భాగంగానే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ను ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ 112తో అనుసంధానించాలని నిర్ణయించింది. తద్వారా సత్వర సేవలు అందుతాయని భావించింది. అందులో భాగంగా చైల్డ్‌లైన్ సేవల్లో ఈ మార్పులు తీసుకొచ్చినట్లు తెలిసింది.

జిల్లా కేంద్రంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

కొత్తగా తీసుకొచ్చిన మార్పులకనుగుణంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ అందుకు తగిన చర్యలు చేపడుతోంది. జిల్లా కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంతో పాటు పలాస రైల్వే కేంద్రంగా కాల్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. కేంద్రాల్లో కంప్యూటర్లు, నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 14 మంది సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించారు. వీరిలో ఎనిమిది జిల్లా కంట్రోల్‌రూమ్‌లో, మిగిలిన ఆరుగురు పలాస రైల్వేస్టేషన్ యూనిట్‌లో పనిచేయనున్నారు.

ఇలా పని చేస్తుంది

చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు వచ్చే ఫోన్ కాల్స్‌ను అత్యవసర, సాధారణ, సమాచార కోసం వంటి మూడు కేటగిరీలుగా విభజించారు. వైద్య సాయం, పోలీస్, అగ్ని ప్రమాదం, అంబులెన్స్, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్య వివాహాలు, బాల కార్మికులు, తప్పిపోవడం వంటి అంశాలను అత్యవసర కాల్స్‌గా పరిగణిస్తారు. న్యాయ సహాయం, విద్య, మానసిక, సామాజిక మద్దతు, వ్యక్తిగత ఫోన్లు, స్నేహితులు, కుటుంబసభ్యుల నుంచి వచ్చే ఫోన్లను సాధారణ కాల్స్‌గా పరిగణించనున్నారు. ఇవి కాకుండా విద్య, ఉపాధి తదితర అంశాలపై ఫోన్లను సమాచార కేటగిరీలో చేర్చారు. చైల్డ్ హెల్ప్‌లైన్‌కు వచ్చే ఫోన్స్ తొలుత రాష్ట్ర కేంద్రంలోని మహిళా శిశు అభివృద్ధి కాల్ సెంటర్‌కు వెళ్తాయి. అక్కడ కాల్స్ మూడు కేటగిరీలుగా వర్గీకరణ జరిగి సంబంధిత విభాగాలకు సమాచారం చేరవేస్తోంది. సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది ఆపదలో ఉన్న బాలలకు సహాయం అందించనున్నారు. జిల్లా కేంద్రంలోని కంట్రోల్‌రూమ్ దీన్ని నిరంతరం పర్యవేక్షించనుంది.

ప్రజల్లో అవగాహన కల్పిస్తాం



చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలు ఇకపై మిషన్ వాత్సల్య పథకం ద్వారా అందనున్నాయి. వీటిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తాం. ఆపదలో ఉన్న బాలలకు నేరుగా ప్రభుత్వం ద్వారా సహాయం అందుతుంది. అందరి సహకారంతో దీన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

- కె.వి రమణ, బాలల రక్షణ అధికారి

కాటేసిన నిద్ర మత్తు

- కల్వర్టును ఢీకొన్న కారు
- ఇద్దరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు



కల్వర్టును ఢీకొట్టిన కారు





రజిత, వెంకటయ్య మృతదేహాలు


ప్రజాశక్తి - పలాస

నిద్ర మత్తు రెండు నిండు ప్రాణాలను బలిగొంది. దైవ క్షేత్రాలను దర్శించుకుని తిరిగొస్తుండగా రెప్పపాటు క్షణంలో వేగంగా వస్తున్న కారు కల్వర్టును ఢీకొట్టింది. పలాస మండలం రామకృష్ణాపురం వద్ద చోటుచేసుకున్న ఈ ఘటనలో హైదరాబాద్‌లో ఓల్డ్‌సిటీకి చెందిన గౌరిశెట్టి రజిత (59) అక్కడికక్కడే మృతి చెందగా, రంగారెడ్డి జిల్లా చైతన్యపురికి చెందిన కొండూరు వెంకటయ్య (64) ఆస్పత్రిలో మృతి చెందాడు. మరో నలుగురు గాయపడ్డారు. పోలీసులు, క్షతగాత్రులు కథనం మేరకు తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చైతన్యపురికి చెందిన కొండూరు వెంకటయ్య, కొండూరు విజయలక్ష్మి, హైదరాబాద్‌కు చెందిన సముద్రాల కృష్ణయ్య, సముద్రాల పద్మ, హైదరాబాద్ ఓల్డ్ సిటీకి చెందిన గౌరిశెట్టి రజిత కుటుంబసభ్యులు. వీరు ఆలయాల సందర్శనకు వెళ్లడానికి నిర్ణయించుకుని నల్గొండ జిల్లా మద్దిరాలకు చెందిన పగిండ్ల జానయ్య కారు బుక్ చేసుకున్నారు.

ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్, కోణార్క్, పూరీ జగన్నాథ స్వామి ఆలయాన్ని దర్శించుకుని తిరిగి కారులో హైదరాబాద్‌కు పయనమయ్యారు. పలాస మండలం రామకృష్ణాపురం వద్దకు వచ్చేసరికి కారు డ్రైవర్ జానయ్య నిద్ర మత్తులోకి జారుకోవడంతో, కారు జాతీయ రహదారి కల్వర్టుకు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రజిత అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన వెంకటయ్య, పద్మ, కృష్ణయ్య, డ్రైవర్ జానయ్యను స్థానికులు 108, హైవే అంబులెన్స్‌లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో వెంకటయ్య మృతి చెందాడు. కృష్ణయ్య, పద్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

త్వరితగతిన స్టూడెంట్ ఇన్ఫో డేటా అప్‌డేట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

స్టూడెంట్ ఇన్ఫో డేటాను త్వరితగతిన అప్‌డేట్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులు, పలు కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి నుంచి ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్ విద్యార్థుల వివరాలు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ https://studentinfo.ap.gov.in లింక్ ద్వారా డేటా అప్‌డేట్ వేగవంతం చేయాలని కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. నేటికీ డేటా ఎంట్రీ 50 శాతం పూర్తయిందని, మిగిలిన శాతం డేటా ఎంట్రీ వేగవంతం చేయాలన్నారు. ఈ డేటా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటే, విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందజేయడం సులభతరం అవుతుందన్నారు. సమావేశంలో ఆర్ఐఒ దుర్గారావు, డివిఇఒ ప్రకాశరావు, పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

అందరిలో 'స్ఫూర్తి' రావాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్ఫూర్తి కార్యక్రమం ద్వారా రక్తదానం, మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ వ్యవస్థాపకుడు డునార్ట్ హెన్రీ చిత్రపటానికి పూలమాల వేశారు. నృత్య దర్శకుడు రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం ఆధ్వర్యాన రక్తదానంపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ముద్రించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేవాభావంతో విధులు నిర్వహించడానికి ఇది మంచి వేదికన్నారు. ఐఆర్‌సిఎస్ ద్వారా 24 రకాల సేవలు అందిస్తున్నారని, ఇందులో వాలంటీర్ల పాత్ర చాలా కీలకమమని చెప్పారు. టిబి ముక్త పంచాయతీలో భాగంగా రోగులకు కిట్లు అందజేయనున్నట్లు తెలిపారు. సిఎస్ఆర్ నిధుల నుంచి రూ.16 లక్షలు విడుదల చేయనున్నట్లు చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమంలో మెదటి స్థానంలో ఉండేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. బ్లడ్ గ్రూప్‌తో పాటు హెచ్‌బి టెస్టులకు కావాల్సిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెడ్‌క్రాస్ సేవలను రాష్ట్రస్థాయిలో నిలిపిన రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావును అభినందించారు.

రెడ్‌క్రాస్ కార్యదర్శి మల్లేశ్వరరావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ కార్యకలాపాలను వివరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ అందరి సహకారంతోనే రెడ్‌క్రాస్ సేవలు వృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో రక్తదాన శిబిరాలు ఎక్కువగా నిర్వహించిన తమ్మినేని వాణీ సీతారాం, గౌతు శిరీష, సువ్వారి గాంధీతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు కళాశాలలు, విద్యాసంస్థలు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, నేత్రదాన చేసిన వారికి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డాక్టర్ సుధీర్, ప్రముఖ కంటి వైద్యులు పి.ఎల్.ఎన్ రాజు, ఎడిఎంహెచ్ఒ అనురాధ, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, డిఇఒ ఎస్.తిరుమల చైతన్య, పెంకి చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హెన్రీ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

జీడి పరిశ్రమలను తెరిపించాలి

జీడి, రైస్‌మిల్లర్ల కార్మిక సంఘం కార్యదర్శి తాతయ్య

ప్రజాశక్తి - పలాస



సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్య

జీడి పరిశ్రమల బంద్‌తో కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, తక్షణమే జీడి వ్యాపారులు బంద్‌ను విరమించాలని జీడి, రైస్‌మిల్లర్ల కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోనేరు భీమారావు, బొమ్మాళి తాతయ్య, గౌరవాధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. పలాస జీడి కార్మికుల సంఘం భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జీడి వ్యాపారులు ఏకపక్షంగా బంద్‌కు పిలుపునిచ్చారని విమర్శించారు. మూకుమ్మడిగా పరిశ్రమలను మూసివేస్తే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, అవకాశం ఉన్నంతవరకు కొన్ని పరిశ్రమలను తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరినా వ్యాపారులు పట్టించుకోలేదని విమర్శించారు. పరిశ్రమల బంద్‌కు 12 రోజుల పాటు అంగీకరించామని, ఈనెల 19వ తేదీ నుంచి జీడి పరిశ్రమలు తెరవకపోతే ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతామన్నారు. సమావేశంలో సంఘ కోశాధికారి తామర కూర్మారావు, ఉపాధ్యక్షులు ఆదినారాయణ, కె.మల్లేశ్వరరావు జె.మోహనరావు, జి.లక్ష్మణరావు, చీకటి ధనలక్ష్మి, జోగి ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాలకు అనుసంధాన రోడ్లు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - గార

జిల్లాలో మత్స్యకార గ్రామాలను అనుసంధానం చేస్తూ రూ.మూడు కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. మండలంలోని కె.మత్స్యలేశంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో టిడిపి ప్రభుత్వంలో వేట నిషేధ సమయాన మత్స్యకారులను పట్టించుకోలేదని, దీనివల్ల ప్రతి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒకవైపు ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందజేస్తూనే, మత్స్యకారులకు వేట నిషేధ కాలానికి రూ.పది వేలు వంతున భృతి చెల్లిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలు మెచ్చిన పాలన అందిస్తున్నామన్నారు. 2014 ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఏఒక్కటీ నెరవేర్చలేకపోయారని, కొత్తగా ఇప్పుడు జగన్ ఇస్తున్న పథకాలకు పేర్లు మార్చి ఇస్తామని నమ్మబలుకుతున్నారని చెప్పారు. మత్స్యలేశంలో 457 మందికి పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశామని, గ్రామంలో 11 రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి గొండు రఘురాం, ఎంపిడిఒ ఎస్.రమణయ్య, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణ, ముంజేటి కృష్ణ, పీస గోపి, పీస శ్రీహరి, కెప్టెన్ ఎరన్న తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల రీఛార్జికి ప్రణాళికలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

భూగర్భ జలాల అధిక వినియోగ ప్రాంతాలను గుర్తించి నీటిని రీఛార్జ్ చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన భూగర్భ జల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ నేషనల్ అక్విఫర్ మ్యాపింగ్ కార్యక్రమంలో భాగంగా భూమిలో 200 మీటర్ల లోతు వరకు నీటి సామర్థ్యం నిల్వ చేసుకునే రాతి పొరలను గుర్తించాలన్నారు. ప్రజలు, పరిశ్రమలు వినియోగిస్తున్న నీటి వినియోగం, నీటి లభ్యత, నీటి మిగులు వంటి అంశాలను గణించడానికి దోహదపడుతుందని చెప్పారు. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

భూగర్భ అధిక వినియోగ ప్రాంతాలను గుర్తించి, నీటి రీఛార్జ్ ప్రణాళికలు తయారు చేసే మ్యాపింగ్‌పై కేంద్ర భూగర్భ జల శాస్త్రవేత్త జి.రవికుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. జిల్లాలో 30 మండలాల పరిస్థితులను వివరించారు. జిల్లాకు సంబంధించిన ఈ నివేదికను కలెక్టర్‌కు సెంట్రల్ గ్రౌండ్ వాటర్ శాఖ అధికారులు అందజేశారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రతిని సంబంధిత శాఖలకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి ఎద్దడి అధికంగా ఉండే ప్రాంతాల్లో 306 చెక్‌డ్యామ్‌లు, 196 పెర్క్యులేషన్ ట్యాంకులను నిర్మించేందుకు ఆయా ప్రాంతాలో నిర్మాణాలు వెంటనే చేపట్టాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజును ఆదేశించారు. సమావేశంలో డిఎఫ్ఒ నిషాకుమారి, గ్రౌండ్ వాటర్ డీడీ బి.రమణమూర్తి, ఎడి లక్ష్మణరావు, వ్యవసాయశాఖ జెడి శ్రీధర్, జలవనరులశాఖ ఇఇ సుధాకర్, సిపిఒ ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పరిహారం అందించాం

ప్రజాశక్తి - పలాస



ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేస్తున్న అప్పలరాజు

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత బొడ్డపాడు రెవెన్యూ పరిధిలోని జగనన్న స్మార్ట్ సిటీకి 150 ఎకరాలు, జగనన్న కాలనీ కోసం సేకరించిన 60 ఎకరాలకు సంబంధించి పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించామని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. మండలంలోని బొడ్డపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాలున్నా, లేకపోయినా పరిహారం ఇచ్చామన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల కోసం తీసుకున్న భూములకు నష్టపరిహారం ఇచ్చారా అని ప్రశ్నించారు. రూ.700 కోట్లతో నిర్మాణం చేపడుతున్న మంచినీటి పథకాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి త్వరలోనే ప్రారంభిస్తారని తెలిపారు. ఇంకా ప్రభుత్వ పథకాలు ఎవరికైనా అందకపోతే వాటిని సరిచేసి సాంకేతిక లోపాలను తొలగించి అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలన్నదే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం లబ్ధిదారులకు పలురకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

జీడి మద్దతు ధర కల్పించాలి

జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.కుసుమ, రైతులు మంత్రిని కోరారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని, జీడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రేపు ఫ్యాప్టో జిల్లా సదస్సు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 9న నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఫ్యాప్టో సంఘాల జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్‌మోహన్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమణమూర్తి తెలిపారు. స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సదస్సులో 117 ఉత్తర్వులు రద్దు, 11వ పిఆర్‌సి బకాయిల చెల్లింపు, కాంట్రాక్టు ఉద్యోగులకు ఎటువంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరణ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎటిఎస్ చెల్లింపు తదితర సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సదస్సుకు ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎన్.వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ సిహెచ్.మంజుల పాల్గొంటున్నట్లు చెప్పారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ఫ్యాప్టో సభ్య సంఘాల కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు, ఇతర ఫ్యాప్టో సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఫ్యాప్టో సంఘాల నాయకులు

15 నాటికి నివేదికలు అందజేయాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా పర్యావరణ ప్రణాళిక నివేదికలను ఈనెల 15వ తేదీ నాటికి అందజేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యావరణ ప్రణాళిక తయారీపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఇఇ ఎం.వి పద్మావతి మాట్లాడుతూ సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యులన్ ఆదేశాల మేరకు ప్రణాళిక తయారు చేయాలన్నారు.

సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ఎస్.కె.వి సత్యనారాయణ, ఇరిగేషన్ ఎస్ఇ సుధాకర్, డిప్యూటీ డిఎంహెచ్ఒ అనురాధ, భూగర్భ జలశాఖ డీడీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బ్యాలెట్‌ను లెక్కిస్తున్న సభ్యులు

విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారీగా పెరిగిన విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని శ్రీకాకుళం ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మన భాస్కర్, ఎం.ఆదినారాయణమూర్తి డిమాండ్ చేశారు. నగరంలోని రామలక్ష్మణ కూడలి వద్ద విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసిస్తూ... నాలుగో రోజు శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. శ్లాబుల మార్చి ప్రజలపై పెద్దఎత్తున భారాలు మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ల కాలంగా వాడుకున్న విద్యుత్ బిల్లులు వినియోగదారులు చెల్లించినా, లోటు భర్తీ పేరుతో, అదే వినియోగంపై సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ. వేల కోట్ల అదనపు భారం వేశారని అన్నారు. పాత బిల్లులపై కొత్తగా బాకీలనడం, ఫిక్స్‌డ్ ఛార్జీ, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీలు ఇలా రకరకాల పేర్లు పెట్టి ప్రజలపై భారం వేశారని అన్నారు. దీనికి తోడు ప్రతి ఇంటికీ షాపుల స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నారని అన్నారు. ప్రీ పెయిడ్ మీటర్ల రూపంలో ముందుగానే ఛార్జీలు చెల్లించే విధానం అమలులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారని అన్నారు. ప్రభుత్వ రంగంలోనే విద్యుత ను కొనసాగించి, లోపాలు సవరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం కొనసాగింపుగా, వినియోగదారుల సంతకాల సేకరణ రోజూ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వి.జి.కె.మూర్తి, కె.శ్రీనివాసు, పి.సుధాకర్, కె.సూరయ్య, డి.భాస్కర్, వి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ లబ్ధి

ప్రజాశక్తి- పొందూరు

అర్హులను సంపూర్ణంగా గుర్తించి సంక్షేమ పథకాలను, పౌరసేవలను అందజేయడమే జగనన్న సురక్ష లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కింతలి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని మాట్లాడారు. అర్హత ఉన్న ఏ ఒక్కరైనా పథకం పొందకుండా ఉంటే అటువంటి వారిని గుర్తించి అందజేసేందుకు జగనన్న సురక్ష ఆలోచన ముఖ్యమంత్రి చేశారని అన్నారు. ప్రజల సమయం వృథా కాకుండా ఇంటివద్దనే పౌర సేవలు అందించే దిశలో సచివాలయ వ్యవస్థ ద్వారా 99 శాతం మంది ప్రభుత్వ పథకాలను అందుకుంటున్నారన్నారు. ఇంకా మిగిలిన ఉన్న ఒక్క శాతం అర్హత కలవారిని ఆమేరకు ఇళ్లకు పంపి గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కొందరి విషయంలో అర్హత ఉండి కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చిందని, కారు ఉందని, భూమి ఉందని తొలగించిన వారి విషయంలో అర్హత ఉంటే వాటిని సరిచేసి తిరిగి పథకాలు వర్తింప చేసేలా చూడటమే కార్యక్రమం ఉద్దేశం అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా అవసరమైన కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లొలుగు కాంతరావు, సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బడాన సునీల్ పాల్గొన్నారు.

జి.సిగడాం: ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని అర్హులందరికీ అందించడమే జగనన్న సురక్ష పథకం సంకల్పమని ఎమ్మెల్యే గొర్ల కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మెట్టవలస,


జి.సిగడాం : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

దేవరవలస గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్షలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దరఖాస్తుదారులకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను వారి ఇంటి వద్దకే అందజేసేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుందన్నారు. అనంతరం వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, మండల వైసిపి అధ్యక్షుడు వెంకటరమణ, సర్పంచ్ కామోజులు సీతారాం, ఎంపిడిఒ కె.నిశ్చల, తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎపిఒ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బగాది భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని దేరసాంలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.

నందిగాం : ముఖ్యమంత్రి జగన్ వల్లే పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని కొత్తగ్రహారంలో సర్పంచ్ ప్రతినిధి కింతల శేషగిరి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శివప్రసాద్, డిటి ఎన్.భాగ్యలక్ష్మి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానిథులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు కూన శాంతారావు, బొమ్మాళి గున్నయ్య, మడపాల సంజీవరావు, మండల ఎఇఒ శ్రీకాంత్ వర్మ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలో 16, 17 వార్డుల్ల కలిగిన లబ్ధిదారులు సర్వే చేస్తున్నట్లు వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య తెలిపారు. తెలిపారు. అర్హత ఉండి కూడా ఎదైనా పథకాలు రావడం లేదో? తెలుసుకున్నామని అన్నారు. అలాగే కులం, ఆదాయం తదితర ధ్రువపత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో 17 మున్సిపల్ కమిషనర్ రమేష్, కౌన్సిలర్ టెంక లక్ష్మి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని స్పెషలాఫీసర్ భవానీశంకర్ అన్నారు. మండలంలోని పరశురాంపురంలో జగనన్న సురక్షలో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, మండల ఎఒ దానకర్ణుడు, ఎపిఎం లలిత, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయకుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, సర్పంచ్‌లు తెంబూరు ప్రసాదరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని నెలవంకలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఆదాయ, కుల, జనన, మరణ తదితర ధ్రువపత్రాలను ఎంపిపి కడియాల పద్మ అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.శేఖర్, ఎఎంసి చైర్మన్ దువ్వ కృష్ణారెడ్డి, సర్పంచ్ దుర్గాసి గౌతమి కుమార్, మోహన్‌రెడ్డి, రజనీకుమార్ దొలై, ఎంపిటిసి రోజా చిన్నారెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి పాల్గొన్నారు.



పొందూరు : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న స్పీకర్ సీతారాం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని తాళభద్ర, సూదికొండ ప్రాంతాల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో చైర్మన్ బల్ల గిరిబాబు పాల్గొన్నారు. తాళభద్ర సచివాలయంలో నిర్ణీత సమయానికి 79 ధ్రువీకరణ పత్రాలు, 44 ఆధార్ కార్డు సవరణలు, సూదికొండ సచివాలయంలో 129 ధ్రువీకరణ పత్రాలు, 17 ఆధార్ సవరణలు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, మీసాల సురేష్, విప్ శంకరపండా, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, కౌన్సిలర్ మాధవరావు, బడగల సుజాత, శిష్టి గోపి, సవర సోమేశ్వరరావు, కమిషనర్ కమిషనర్ నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలోని 7,8 వార్డుల్లో నిర్వహించిన జనగన్న సురక్షలో వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి పాల్గొన్నారు. ఇందులో భాగంగా వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, కౌన్సిలర్లు మధుమూర్తి, బచ్చు జగన్, కో-ఆప్షన్ మెంబర్ సాలీనా ఢిల్లీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఘనంగా కృష్ణదాస్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- నరసన్నపేట

నిజాయితీ గల రాజకీయ నాయకుడు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు అధ్యక్షతన ఎమ్మెల్యే కృష్ణదాస్ జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ప్రజా జీవితాన ఉన్న వారికి ప్రజల సంతోషమే ప్రధాన ధ్యేయమని అన్నారు. కృష్ణదాస్ మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అందరి సమక్షంలో కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పోలాకి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కిరణ్‌కుమార్,, విశ్వసరాయి కళావతి, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, పేరాడ తిలక్, పంగ కృష్ణవేణి, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత గుప్తా, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతి గది ప్రారంభం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో నేలబొంతు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో డిజిటల్ తరగతి గదిని జెసి ఎం.నవీన్ శుక్రవారం ప్రారంభించారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యాన డిజిటల్ తరగతి రూమ్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం విద్యాభివృద్ధిపై విద్యార్థులతో ముచ్చరించారు. ముందుగా పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. ఆర్‌ఒ ప్లాంట్ పనిచేయకపోవడాన్ని గుర్తించి త్వరగా మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, తహశీల్దార్ పి.సరోజని, ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, పద్మనాభం, మండల ఎఒ దానకర్ణుడు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినితో ముచ్చటిస్తున్న జెసి నవీన్

అభివృద్ధి చూసి మాట్లాడాలి

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

కిడ్నీ పరిశోధన కేంద్రం, ఆస్పత్రి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనే శంకుస్థాపన చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరును తన గెడ్డం దీక్షతో ఎమ్మెల్యేగా గౌతు శివాజీ అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.450 కోట్లు విడుదల చేసిన విషయం మంత్రి అప్పలరాజు విస్మరించడం సిగ్గుచేటన్నారు. రూ.500 కోట్ల వ్యయంతో ఎన్‌టిఆర్ సుజల స్రవంతిని పలాసకు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఎహెచ్‌పి, హుదూద్ గృహాలు టిడిపి హయాంలో నిర్మించినవేనని అన్నారు.


మాట్లాడుతున్న గౌతు శిరీష

ఎంపీని విమర్శించడం తగదు

జిల్లా ఖ్యాతిని ఢిల్లీకి తీసుకెళ్లిన కింజరాపు రామ్మోహన్ నాయుడును వైసిపి నాయకులు విమర్శించడాన్ని తదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు తప్పుబట్టారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సహ కేంద్రమంత్రుల ప్రశంసలు అందుకున్న ఎంపీని విమర్శించే స్థాయి వైసిపి నాయకులకు లేదన్నారు. జిల్లాలో రైల్వేల అభివృద్ధి చర్యలు తీసుకున్నారని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఎంపీ పోరాడడాన్ని ప్రజలు ఇంకా గుర్తించుకునే ఉన్నారని అన్నారు. సమావేశంలో లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్త, అంబటి కృష్ణమూర్తి, గోళ్ల చంద్రరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగన్నాథం

వినియోగదారుల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినియోగదారుల చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని విశ్రాంత జడ్జి పప్పల జగన్నాథం పిలుపునిచ్చారు. మేధావుల ఫోరం ఆధ్వర్యాన నగరంలోని పిఎన్ కాలనీలో గల నారాయణ తిరుమల యోగా హాల్లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల రక్షణకు పాత చట్టాన్ని సవరిస్తూ 1986లో కొత్త చట్టాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఈ చట్టం ద్వారా ఉత్పత్తి బాధ్యత, రెగ్యులేటరీ, మధ్య వర్తిత్వం, జిల్లా స్థాయిలో రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అపరాధం వసూలుకు అవకాశం ఉందన్నారు. ఈ చట్టం ద్వారా వినియోగదారునికి ఆరు రకాలైన హక్కులు దఖల పడ్డాయని వివరించారు. సమావేశంలో కె.పోలినాయుడు, మెట్ట అన్నాజిభట్లు, విఎస్ఎస్ శ్యామ్, బి.అర్జునరావు, ఎ.సత్యనారాయణ, దుర్గాప్రసాద్, ఎం.ఎ.భట్లు, తవిటినాయుడు, ఎస్.సింహాచలం పాల్గొన్నారు.

11 నుంచి కౌన్సెలింగ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

2023-24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు అంబేద్కర్ బాలబాలికల గురుకులాల్లో మిగులు సీట్లు భర్తీ చేసేందుకు ఈనెల 11 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త ఎన్.బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు మందస, పాతపట్నం, పెద్దపాడు, ఎచ్చెర్ల, నందిగాం గురుకులాల్లో, బాలురుకు దుప్పలవలస, కొల్లివలస, కంచిలిల్లో 5వ తరగతిలో చేరేందుకు మిగులు సీట్లు ఉన్నట్టు తెలిపారు. ఈ నెల 11న దుప్పలవలసలో, 12న ఎచ్చెర్ల గురుకులాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని విద్యార్థినులు మాత్రమే ఈ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు సంబంధిత గురుకులాల్లో సంప్రదించాలని సూచించారు.

సుస్థిర జీవనోపాధికి అర్బన్ మార్కెట్లు

మెప్మా పీడీ కిరణ్‌కుమార్


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులలో సుస్థిర జీవనోపాధికి అర్బన్ మార్కెట్లతో గుర్తింపు లభిస్తుందని మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ ఐడిఎస్‌ఎంటి కాంప్లెక్స్ ఆవరణలో మెప్మా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్‌లో నెలకు ఒకసారి, మున్సిపాలిటీల్లో ప్రతి మూడు నెలలకొకసారి అర్బన్ మార్కెట్లు నిర్వహిస్తామని చెప్పారు. తద్వారా సంఘ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ అనుసంధానం ద్వారా తగిన గుర్తింపు, ధర లభిస్తుందని అన్నారు. ఇప్పటికే శ్రీకాకుళం కార్పొరేషన్‌లో జగనన్న మహిళా మార్టు ప్రారంభించామని, త్వరలో పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలస ల్లోనూ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మహిళా మార్టు స్వయం సహాయక సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో కొనసాగుతాయని తెలిపారు. జీవనోపాధుల ఏర్పాటుకు ముందుకువచ్చే మహిళలకు తగు సాంకేతిక శిక్షణ, సులభతర అనుమతుల మంజూరు, రుణ సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందే ఆర్థిక లబ్ధిని సక్రమపద్ధతిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు

అంతర్జాతీయ విద్య

ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ చైర్మన్ ఎన్.ఈశ్వరరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని తరగతుల వారికి ఇంటర్నేషనల్ విద్య అందిచడమే ఎన్ఇఆర్ స్కూల్ ధ్యేయమని ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్, వ్యవస్థాపకుడు నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో ఉన్న ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ మూడో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఉన్నతమైన ఆలోచలతో ముందుకు సాగాలని కోరారు. నాణ్యమైన విద్యను అందించడానికి పాఠశాల నిబద్ధతను పునరుద్ఘాటించారు, విద్యార్థులను సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధం చేయడంపై దృష్టి సారించామన్నారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ప్రాంతంలో ఉన్నతమైన విద్య బోధించడానికి 18 రాష్ట్రాల్లో నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ ఎన్.తేజ మాట్లాడుతూ విద్యారంగంలో ఈ ప్రాంతం అభివృద్ధికి చైర్మన్ కన్న కలలు నెరవేర్చడానికి తన అచంచలమైన అంకితభావాన్ని కలిగి ఉంటానని హామీ ఇచ్చారు.

హైదరాబాద్‌కు చెందిన మోటివేషన్ల్ స్పీకర్ సతీష్ విజయవంతమైన వ్యక్తుల నుంచి ఉదాహరణలను పంచుకుంటూ లా ఆఫ్ ఎట్రాక్షన్ గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎన్ఇఆర్‌ని ఫోరమ్ ఫర్ బెటర్ శ్రీకాకుళం ప్రతినిధులు ది మోస్టు ప్రామినెంట్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో సత్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఇఒ అజ్జాడ త్రినాథరావు, మాజీ ఎంపిపి డి.జి.ఎం.ఆనందరావు, స్థానిక సర్పంచ్ ఎన్.రజని, ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్‌కుమార్, స్కూల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కేక్‌ను కట్ చేస్తున్న 'ఎన్ఇఆర్'


అవస్థలు పడుతున్న విద్యార్థులు

ఆమదాలవలసలో భారీ వర్షం

ఆమదాలవలస: పట్టణంలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జూనియర్ కళాశాల ఆవరణ, పూజారిపేట, కంద్రపేట, పాతిన వారి వీధి, మెట్టక్కివలస, గేటు తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి మురుగు నీరు రహదారులపై ప్రవహించింది. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. జూనియర్ కళాశాల ఆవరణలో వర్షానికి నీరు నిల్వ ఉండడంతో విద్యార్థులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులకు గురయ్యారు. పూజారిపేటలో స్పీకర్ ఇంటికి సమీపంలో మురుగనీరు రోడ్డుపై ప్రయాణించడంతో ప్రజలు ఒకింత ఇబ్బందికి గురయ్యారు. వర్షం పడిన ప్రతిసారి ఇక్కడ మురుగు నీరు రోడ్డుపై నుండి ప్రవహించడం ఆనవాయితీగా మారిందని పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు తెలియజేసినా పెడచెవిన పెడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఘనంగా వన మహోత్సవం

పలాస: కాశీబుగ్గ భాష్యం పాఠశాలలో శుక్రవారం వనమహోత్సవం సంఘం నిర్వహించారు. అనంతరం పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావుకు మొక్కలను బహుకరించారు. కార్యక్రమంలో భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, సత్యం విజయమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంఇఒకు మొక్కను అందజేస్తున్న విద్యార్థులు

ఆక్రమణల తొలగింపు

టెక్కలి రూరల్ : టెక్కలి దేవాదాయశాఖ పరిధిలోని లక్ష్మణ బాలాజీ ఆలయానికి సంబంధించిన స్థలాల్లో అక్రమ నిర్మాణాలను దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రొక్లెయినర్ సహాయంతో శుక్రవారం తొలగించారు. ఆలయానికి సంబంధించి సర్వే నంబరు 409/3లో 2.17 ఎకరాలు మెట్టు భూమి ఉంది. ఈ స్థలంలో లీజు కాలం పూర్తయింది. అయినా ఆ స్థలంలో కొనసాగుతున్నారు. అంతేకుండా ఆ స్థలంలో దుకాణాలను నిర్మించి అనధికారికంగా సబ్ లీజులు ఇచ్చి దేవాదాయశాఖ ఆదాయానికి నష్టం కలిగిస్తున్నారు. దీనిపై ఈ ఏడాది మే 25న సదరు ఆక్రమణదారులకు దేవాదాయశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, టెక్కలి ఇఒ ఎ.వి.సూర్యనారాయణల పర్యవేక్షణలో పోలీసుల సహకారంతో అక్రమ కట్టడాలను, ఆక్రమణలను తొలగింపు చర్యలు చేపట్టారు. తొలగింపు నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక ఎస్ఐ ఎల్.రామకృష్ణ తన సిబ్బందితో పర్యవేక్షించారు.


ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న అధికారులు

సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

టెక్కలి : రాష్ట్రంలో అధికార పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఎల్లో మీడియా ద్వారా ప్రతిపక్షాలపై బురదజల్లుతూ వాస్తవాలను వక్రీకరించే విధంగా వ్యవహరిస్తుందని తెలుగు యువత మండల అధ్యక్షులు మెండ దాసునాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సోషల్‌మీడియా కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి కార్యక్రమాలు, అభివృద్ధి, చంద్రబాబు మేనిఫెస్టోపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ కల్పనల పేరుతో నిరుద్యోగులను వంచించిందని, ఏటా జాబ్ కేలండర్ ఎక్కడ ఇచ్చారని సూటిగా ప్రశ్నిస్తూ ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, రెయ్యి ప్రీతీష్‌చంద్, కోళ్ల కామేష్, కోళ్ల లవకుమార్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మధన్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసునాయుడు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొర్లకోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చింతాడ పార్వతీశ్వరరావు ఇటీవల ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన్ సువ్వారి ఝాన్సీ అధ్యక్షతన శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.అప్పారావు, ఉపాధ్యాయులు కంచరాపు రాజేశ్వరరావు, బొడ్డేపల్లి రమేష్, బలగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని భావనాపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు టి.కామేశ్వరరావు ఘనంగా సన్మానించారు. ఎన్.సీతారాం, గోపాలకృష్ణ, శశికుమార్‌లకు దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మురళిస్వామి, నారాయణ, అప్పారావు, నిర్మల, శైలజ పాల్గొన్నారు.


పొందూరు : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

పొందూరు: విద్యార్థులతో మమేకమై చక్కని బోధన చేసే ఉపాధ్యాయులకు విద్యార్థుల నుంచే కాకుండా గ్రామస్తుల నుంచి గౌరవం దక్కుతుందని తండ్యాం యుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రంగారావు, ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు ఎం.రమణారావు అన్నారు. మండలంలోని తండ్యాం పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన టి.మురళీమోహన్, ఆర్.వి.రాజేష్, బస్వా సతీష్, డి.ఈశ్వరరావు, బి.మంజులతలను దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి భాస్కరరావు, ఎంపిటిసి ప్రతినిధి వడగా మోహనరావు పాల్గొన్నారు.


ఆమదాలవలస : మెమొంటో అందుకుంటున్న గాంధీ

సేవలకు గుర్తింపు

రక్తదానంతో పాటు ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి గుర్తింపు లభించింది. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ వార్షిక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా 2022-23లో రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించిన నాయకులకు, స్వచ్ఛంద సంస్థల అధినేతలకు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావులు మెమెంటోలు, ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. ఆమదాలవలస మండలం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ, ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు, రణస్థలం సేవాఫౌండేషన్ అధ్యక్షులు ఇడదాసుల తిరుపతిరాజులు మోమోంటోలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

– ప్రజాశక్తి, జిల్లా విలేకరుల యంత్రాంగం


లావేరు : మెమొంటో అందుకుంటున్న అప్పలనాయుడు


రణస్థలం : మెమొంటో అందుకుంటున్న తిరుపతిరాజు

కాంగ్రెస్ నాయకుల ఆందోళన

ప్రజాశక్తి- టెక్కలి

ట్రయల్ కోర్టు తీర్పును సమర్థిస్తూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు వ్యాఖ్యానించారు. కోర్టు తీర్పు వచ్చిన వెంటనే టెక్కలిలో కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని అన్నారు. గుత్త పెట్టుబడిదారులకు దేశాన్ని తాకట్టు పెట్టే విధానం నశించాలన్నారు. మతం పేరుతో విద్వేషాలు మంచివి కావని, పోరాడుతున్న రాహుల్‌గాంధీని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు ఈ తీర్పు ఊతమిచ్చిందని అన్నారు. ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ లౌకికవాదానికి అనుకూలంగా రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పొట్నూరు ఆనందరావు, ఎస్.ధర్మారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సనపల అన్నాజీరావు అన్నారు. ఆయన స్వఇఔహంలో ఏర్పాటు చేసిన విలేకరులంతో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పు రివ్యూ పిటిషన్ కొట్టివేయడం రాజ్యాంగ విరుద్ధమని ధ్వజమెత్తారు. ఇడి, సిబిఐ లాంటి సంస్థలను తమ చెప్పు చేతుల్లోకి తీసుకొని రాజ్యాంగ విరుద్ధమైన పనులు చేసే ఈ మోడీ కిలాడీ సర్కార్‌కు ప్రజలు త్వరలో తగిన బుద్ధిచెబుతారని అన్నారు.


టెక్కలి : ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజా సంక్షేమమే ధ్యేయం



వికలాంగుడికి వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని గెడ్డకంచరాంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారాం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు బురాడ వెంకటరమణ, పిఎసిఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, ఎంపిడిఒ కె.నిశ్చల పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాడు-నేడు పనుల ద్వారా పాత భవనాలకు రంగులు వేసి, కొత్త బెంచీలు వేసి విద్య వ్యవస్థ నంబరు ఒన్ అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, పూర్తిస్థాయిలో టీచర్ పోస్టులు భర్తీ చేస్తేనే విద్య వ్యవస్థ బాగుపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి దూరం ప్రాంతాల్ని విద్యాభ్యాసించేందుకు వచ్చే పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు పవన్, చైతన్య ప్రసాద్, నవీన్, రాము, రాహుల్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వినోద్‌కుమార్

లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలని వినతి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టి అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, హైస్కూల్ నుంచి అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రవి, ప్రకాష్ విజయ్, కుమార్ పాల్గొన్నారు.

చరణ్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



చరణ్‌ను సన్మానిస్తున్న స్వామినాయుడు

గురజాడ విద్యా సంస్థల అనుబంధ గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఇటీవల పర్యటిన నాక్ బృందానికి ద్వితీయ బిబిఎ విద్యార్థి చరణ్ సేవలందించారు. ఈ సేవలను గుర్తించి విద్యాసంస్థల చైర్మన్ జివి స్వామినాయుడు కళాశాలలో చరణ్‌కు శుక్రవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఆయన స్ఫూర్తితో సామాజిక సేవల్లో ప్రతి విద్యార్థీ పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, బిబిఎ విభాగాధిపతి వంగ మహేష్, బాలాజీ, గీత, ఉర్లం. శివతేజ పాల్గొన్నారు.

పథకాల పంపిణీలో వివక్ష తగదు

వాడివేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి- బూర్జ



నిలదీస్తున్న సభ్యులు

ప్రభుత్వ పథకాలను అందించడంలో వైసిపి నాయకులు వివక్షత చూపిస్తుందని గుత్తావల్లి సర్పంచ్ ప్రతినిధి హనుమంతు గోపి అన్నారు. బూర్జ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి కర్నేన దీప అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తాపల్లిలో ఇద్దరు వితంతువులు, వికలాంగుడు పదేపదే పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా... పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోయారు. గత మండల సమావేశంలో సభ దృష్టికి తీసుకొచ్చినా ప్రయోజనం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంచాయతీ సర్పంచ్ టిడిపి కావడంతో ప్రజలను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. పి.ఎల్.దేవ్‌పేట సర్పంచ్ మజ్జి ద్రోణగిరి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా మండలంలోని ప్రధాన నీటి వనరైన ఓనిగడ్డ కాలువ మరమ్మతులు చేపట్టకపోవడంతో చుక్క నీరు రాని పరిస్థితి నెలకొంటుందని అన్నారు. ఇలా అయితే రానున్న రోజుల్లో కరువు పరిస్థితి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయని సభలో ధ్వజమెత్తారు. నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారా? లేరో? కానరావడం లేదన్నారు.

కొల్లివలస ఎంపిటిసి అంపిలి విక్రం మాట్లాడుతూ ఆర్‌టిసి పాసింజర్ బస్సులు అరకొరగా ఉండడంతో ఆయా కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. బూర్జ సర్పంచ్ ఏగు అనురాధ మాట్లాడుతూ మండల కేంద్రమైన బూర్జకు గతంలో మూడు బస్సులు తిరిగేవని, ప్రస్తుతం ఒక్క బస్సు కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గృహ నిర్మాణశాఖ ఎఇ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాల చేపట్టిన వారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. ఎంపిపి దీప మాట్లాడుతూ మండలంలోని అన్ని టిసిల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ కండాపు గోవిందరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కన్నడ నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి బి.సూర్యారావు, ఎంపిడిఒ రవీంద్రబాబు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు



పొందూరు : శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని శాసనబ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గోరింటలో రూ.60 లక్షల నిధులతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయికి శంకుస్థాపన, పైడిజోగిపేటలో రూ.8 లక్షల వ్యయంతో తాగునీటి కుళాయిని ప్రారంభించారు. అనంతరం సుమారు రూ.41 లక్షల నిధులతో పైడిజోగిపేటకు బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తాగునీరు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లొలుగు కాంతారావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ, జెఇ చైతన్య, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాడాన సునీల్, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఇంటింటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని శాసనసబ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని పొన్నాంపేట, ఆనందపురం, పెద్దజొన్నవలస గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, చల్లా సింహాచలం, గొంటి కృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చంద్రమౌళి పాల్గొన్నారు.



కుమారిని సత్కరిస్తున్న జెసిఐ సభ్యులు

కుమారికి సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జెసిఐ గ్రీన్‌సిటీ ఆధ్వర్యాన సెల్యూట్ ద సైలెంట్ స్టార్‌కు ప్రధాన తపాలా కార్యాలయంలో మహిళా పోస్టుమేన్‌గా పనిచేస్తున్న సింగుపురం కుమారిని ఎంపిక చేశారు. నగరంలోని గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జెసిఐ గ్రీన్ సిటీ అధ్యక్షులు మణి శుక్రవారం అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీతి, నిజాయితీ గల ఉద్యోగులను, సామాజిక కార్యకర్తలను అభినందించుకునేందుకు ఇదో చక్కని అవకాశమన్నారు. రష్యాలో డాక్టరేట్‌ను పూర్తి చేసుకున్న చాప్టర్ ప్రెసిడెంట్ సాయి వినూతనూ సన్మానించారు. కార్యక్రమంలో మధుబాబు, ఐపిపి సాయి బాబా, లక్ష్మణ్ వైస్ ప్రెసిడెంట్ మల్లేశ్వరరావు, గణపతి జగదీష్, వరలక్ష్మి, ఉష, హిమబిందు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 10వ వార్డు కొత్తపారసాంబలో ఉన్న ముత్యాల పోళమ్మ పురాతన ఆలయం అభివృద్ధికి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు చెరుకుపల్లి నేతాజీ రూ.10 వేలు విరాళం శుక్రవారం అందజేశారు. ఆలయం పనులను డబ్బులు లేక అసంపూర్తిగా ఉండి పోయిందని, సహకారం అందించాలని కోరడంతో తన వంతు సహకారం అందించామని తెలిపారు. ఆలయం నిర్మాణ పనులకు దాతలు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న నేతాజీ

తీరప్రాంత రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు



అవగాహన కల్పిస్తున్న మెరైన్ సిఐ దేముళ్లు

తీరప్రాంత రక్షణ అందరి బాధ్యత అని మెరైన్ సిఐ జి.దేముళ్లు అన్నారు. మండలంలోని దేవునల్తాడలో సాగర్ కవచ్ కార్యక్రమంపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ తీర ప్రాంత రక్షణలో భాగంగా ఈ నెల 12, 13 తేదీలో రాష్ట్రంలోని తీర ప్రాంత భాగంలో సాగర్ కవచ్ పేరుతో కోస్టల్ ఎక్సర్సైజ్‌ను నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఎక్సర్సైజ్‌లో ఇండియన్ నేవీ, ఆక్టోపస్, సిఐఎస్ఎఫ్, ఇండియన్ కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ, స్థానిక పోలీసులు పాల్గొంటారని తెలియజేశారు. భావనపాడు తీర ప్రాంత రక్షణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్న మత్యకారులు, తీర ప్రాంత ప్రజలు, ఆయా తేదీల్లో విషయాన్ని గమనించి చొరబాటు దారులను ఎలాగైనా సరే గుర్తించాలన్నారు. ఎవరైనా చొరబాటు దారులను గుర్తించినట్లయితే కోస్టల్ పోలీసులకు, స్థానిక పోలీసులకు వెంటనే తెలియజేయాలన్నారు. చొరబాటు దారులను, ప్రజలు ఎవ్వరూ కొట్టడం గానీ, దూషించడం గానీ చేయరాదని, వారిని చూసి భయపడనవసరం కూడా లేదని అన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సైబర్ నేరగాళ్లపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని పెద్దవెంకటాపురంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ ఎవరైనా ఫోన్లు చేసి అకౌంట్ వివరాలను అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరితే అతి తక్కువ డబ్బులతో వృద్ధాప్యంలో అధిక ప్రయోజనాలను పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అప్పలనాయుడు, వాలంటీర్ అల్లాడ రత్నకుమారి, ఎస్ఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, అక్షరాస్యత సిబ్బంది రామారావు పాల్గొన్నారు.

ఆరుతడి విధానం లాభదాయకం

ప్రజాశక్తి- రణస్థలం



యంత్రంతో క్షేత్ర ప్రదర్శన చేస్తున్న రైతులు

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మండలంలోని కల్లేపల్లిలో ఎరువులు, విత్తనం ఒకేసారి వేసే (ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్) యంత్రంతో క్షేత్ర ప్రదర్శనలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విఎఎజి హారిక సందర్శించి మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల్లో వర్షాధారంగా లభిస్తున్న తక్కువ నీటితో లాభదాయక దిగుబడులు సాధించాలంటే వరి సాగును యంత్రాలతో చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ఎకరాకు కేవలం 16 కిలోలు విత్తనాన్ని నేరుగా చదును చేసిన పొలంలో ట్రాక్టర్‌తో నడిచే ఎరువులు, విత్తనం ఒకేసారి వేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు ఎస్.అప్పలసూర్యనారాయణ, ఆయా గ్రామాల రైతులు జి.సూర్యనారాయణ, హనుమంతురావు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న గౌతు శిరీష

శిరీష ఆర్థికసాయం

పలాస : పలాస టిడిపి కార్యాలయంలో మందస మండలం సొండుపూడికు వికలాంగుడు మల్లారెడ్డి భాస్కరరావు ఆస్తమాతో బాధపడతున్నాడు. విషయం తెలుసుకొని గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో) ద్వారా రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని గ్లో ప్రధాన కార్యదర్శి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, కొనారి సింహాద్రి, కొవ్వూరు సురేష్, నారాయణ, టంకాల రవిశంకర్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

ఎంఇఒలకు సన్మానం

ప్రజాశక్తి- టెక్కలి

మండల ఎంఇఒలుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దల్లి తులసిరెడ్డి, దాసుపురం చిన్నారావులకు వ్యాయామ ఉపాధ్యాయులు మండల సంఘం శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ సమిష్టి కృషితో విద్యాప్రమాణాలు పెంచేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాడాన నారాయణరావు, కె.కె.ఆర్.రెడ్డి, జగ్గమ్మ, ఆలివేణి, కాపల రఘునాథరావు, సూర్యకాంతం, ఆదిశేషు, రాజా, వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశవరావు

ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతి కుటుంబానికీ వంద రోజులు పని దినములు కల్పిస్తున్నామని ఎపిఒ పి.కేశవరావు తెలిపారు. మండలంలోని పెద్దబొడ్డపాడు కాలనీ ఎస్‌సి కుటుంబాలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల నుంచి వలసల నివారణకు ఉపాధి హామీ కింద పనులు కల్పించామని అన్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలోనే చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు పనులు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కాలువలు, పిల్ల కాలువలు పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు డి.కామేశ్వరి, కె.విజయ, కె.వామాక్షి, ఫీల్డ్ అసిస్టెంట్లు బడే కృష్ణారావు, సీతారాం పాల్గొన్నారు.



రవికుమార్‌ను పరామర్శిస్తున్న చైతన్య

చైతన్య పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో గోకర్ణపురం సర్పంచ్ ఎస్.రవికుమార్‌ను జనసేన పార్టీ నియోజవర్గ ఇన్‌ఛార్జి గేదెల చైతన్య శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేను నిలదీస్తారని ఉద్దేశంతో గురువారం పోలీసులు గృహ నిర్మించడం సరికాదన్నారు. పోలీసుల బందోబస్తుతో సమావేశం నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఎమ్మెల్యేకు వచ్చిందన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే... ఎవరూ నిలదీయరని అన్నారు. ఈయన వెంట దుక్క బాలరాజు, చంటి, హరికృష్ణ, ఉన్నారు.